సాక్షి సిద్దిపేట

సోమవారం ౹ 4 ౹ సెప్టెంబర్ ౹ 2023



దొంగచాటుగా టోల్ బాదుడు

టోల్‌గేట్ సమీప ప్రాంతాల వాహనాలకు కూడా టోల్ వసూలు చేయడంపై స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 8లో▸



ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ

8లో▸

సైబర్ నేరగాళ్లు పంపించిన మెసేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

బదిలీల దరఖాస్తులకు రేపటి వరకు గడువు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులు బదిలీ కోసం ఈనెల 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ప్రాధాన్య విభాగంలో దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు.

న్యూస్‌రీల్

చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడిగా నవీన్‌కుమార్



నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పేర్ల నవీన్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రాజునేత అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం నవీన్‌కుమార్‌కు సన్మానించారు. నవీన్‌కుమార్ మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చేనేతలను ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని, ముడిసరుకుకు ఇస్తున్న సబ్సిడీని మరింత పెంచాలన్నారు. ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్



మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కూచం గారి శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైనట్లు వెల్లడించింది. మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ 28 సంవత్సరాల సర్వీస్‌లో టీచర్, జూనియర్ లెక్చరర్, ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీం) ప్రోగ్రాం ఆఫీసర్‌గా, ఎన్‌సీసీ (నేషనల్ కాండిట్ కోర్) ఆఫీసర్‌గా అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. 2013లో జిల్లా స్థాయిలో ఉత్తమ లెక్చరర్‌గా అవార్డును సైతం అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన శ్రీనివాస్ ఈ నెల 5న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు. శ్రీనివాస్‌కు జూనియర్ కళాశాల లెక్చరర్లు అభినందనలు తెలిపారు.

చర్చిలో ఉపాధ్యాయుల దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను చర్చి నిర్వాహకులు సన్మానించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రార్థనలు కొనసాగాయి. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశమిచ్చారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

- జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. బీసీ రిజర్వేషన్లు 34 నుంచి 52 శాతానికి పెంచాలన్నారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు.

మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



మల్లన్నస్వామి రాజగోపురం ఎదుట భక్తుల సందడి, (ఇన్‌సెట్‌లో) స్వామివారు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. భక్తులు పట్నాలు, అభిషేకాలు, అర్చన, ఒడిబియ్యం, ప్రత్యేక పూజలు, కేశఖండన, గంగిరేణు చెట్టుకు ముడుపులు కట్టి స్వామి వారిని వేడుకున్నారు. కొండ పైన రేణుక ఎల్లమ్మ దేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అయితే ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి భక్తులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. – కొమురవెల్లి (సిద్దిపేట)

దుర్గమ్మా.. చల్లంగా దీవించమ్మా



వన దుర్గమ్మా.. దీవించమ్మా అంటూ వేలాది మంది భక్తులు ఏడుపాయల దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది. – పాపన్నపేట(మెదక్)



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పంటలకు జీవం.. ఆశలు సజీవం



- ఎట్టకేలకు కరుణించిన వరుణుడు
- మొలకలకు ప్రాణం పోసిన వర్షాలు
- రైతుల్లో హర్షాతిరేకాలు

ఆదివారం వర్షపాతం ఇలా..	
నారాయణరావుపేటలో అత్యధికం:	40 మి.మీ.
జిల్లా వ్యాప్తంగా సగటున:	14 మి.మీ.



ఈ ఫొటోలోని రైతు పేరు బేజాడి బాలమల్లు. మద్దూరు మండలం లద్నూర్ గ్రామానికి చెందిన ఈ రైతు 3 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. నెల రోజులుగా వర్షాలు కురవకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. కొన్నిసార్లు స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందించినా పంట నేలచూపులే చూస్తోంది. ఈ క్రమంలో ఆదివారం వర్షం కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్టయిందని ఆ రైతు సంతోషం వ్యక్తం చేశాడు. వర్షాలతో ఇలా జిల్లాలోని రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సాగవుతున్న పత్తి పంట, (ఇన్‌సెట్‌లో) దుబ్బాకలో మొక్కజొన్న సాగు

ప్రశాంత్‌నగర(సిద్దిపేట)/దుబ్బాకటౌన్: జిల్లాలో ఆదివారం కురిసిన వర్షాలు కొన ఊపిరిపై ఉన్న పంటలకు ప్రాణం పోశాయి. జూలై చివరి వారంలో వర్షాలు కురిశాయి. ఆ తరువాత వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతినే దశకు చేరుకున్నాయి. సాగు నీరు అందుబాటులో ఉన్న రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు డ్రిప్‌లు, స్ప్రింక్లర్లను ఉపయోగించగా, నీటి వసతులు లేని రైతులు వరుణదేవుడిపై భారం వేశారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతుల్లో సంతోషం నెలకొంది. మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 3.52 లక్షల ఎకరాల్లో వరి, 1.08 ఎకరాల్లో పత్తి, 30వేల ఎకరాల్లో మొక్కజొన్న, 8 వేల ఎకరాల్లో కంది, 72 వేల ఎకరాల్లో ఉద్యాన, ఇతర పంటలు, మొత్తంగా 5.70లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అయితే జూన్, జూలై నెలల్లో వర్షాలు జోరుగా కురిశాయి. కానీ ఆగస్టు నెలలో మాత్రం చుక్క వర్షం కురవకపోగా, దీనికి తోడుగా ఎండలు తమ ప్రతాపాన్ని చూపాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో రైతులకు ఉపశమనం లభించినట్లయ్యింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం మోస్తారు వర్షాలు కురిశాయి. నారాయణరావుపేట మండల కేంద్రంలో 40మిల్లీమీటర్లు, సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్‌లో 32.3మి.మీ, రాయపోల్ మండల పరిధిలోని బేగంపేటలో 28మి.మీ, దౌల్తాబాద్ మండల కేంద్రంలో 25.5మి.మీ, మిరుదొడ్డి మండల కేంద్రంలో 24.3మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లా వ్యాప్తంగా సగటున 14మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

ప్రాణం పోసిన వాన



పొలంలో ఈసారి పత్తి సాగు చేశాను. నెల రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో ఆందోళనకుగురయ్యాను. ఆదివారం కురిసిన వర్షానికి పంటకు జీవం పోసినట్లయ్యింది. మరో మూడు రోజులు వానలు ఉంటాయని అధికారులు చెబుతుండటం సంతోషంగా ఉంది.

–పోతిరెడ్డి నరసింహులు, రైతు, వల్లంపట్ల

సరైన సమయంలో కురిసింది



పది ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. సరిగ్గా నెల రోజులుగా వాన కురవపోవడంతో డ్రిప్ సౌకర్యంతో నీటిని అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాను. పంటకు సరిగ్గా నీరు అందక దెబ్బతిన్నది. సరైన సమయంలో వాన పడడంతో పంటకు ప్రాణం పోసినట్లయింది.

–వంగాల మహిపాల్‌రెడ్డి, రైతు, వర్ధరాజుపల్లి

చాలా మేలు చేసింది



నెల రోజుల తరువాత వర్షం కురవడంతో రైతులకు చాలా మేలు చేసింది. జిల్లాలో రైతులు అత్యధికంగా పత్తి, మొక్కజొన్నను సాగుచేస్తున్నారు. అన్ని మండలాల్లో వర్షం కురిసింది. వర్షాధార పంటలైన మొక్కజొన్న, పత్తి, కంది ఇతర ఆరుతడి పంటలకు వర్షాలు ప్రాణం పోశాయి.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

ఈజీఎస్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: అర్బన్ మండలం మిట్టపల్లికి చెందిన సిద్దరబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం మంత్రి హరీశ్‌రావు నియామకపత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈజీఎస్ కౌన్సిల్‌కు సీఎం చైర్మన్‌గా ఉండగా ఇద్దరు నామినేటెడ్ సభ్యులుగా ఉంటారని అందులో సిద్దిపేట నియోజకవర్గం నుంచి శ్రీనివాస్‌ను నియమించినట్లు మంత్రి తెలిపారు. శ్రీనివాస్ మిట్టపల్లి సర్పంచ్‌గా గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపి జాతీయ స్థాయి అవార్డు సాధించేలా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు శ్రీనివాస్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని శ్రీనివాస్ తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన

సిద్దిపేటజోన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సిద్దిపేట వాసి ప్రశాంత్‌ను ఆదివారం మంత్రి హరీశ్ రావు అభినందించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఉత్తమ ఉపాధ్యాయుడు ప్రశాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 5న హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సన్మానం, అవార్డు అందుకోనున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్ సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి పట్టణంలోని పలు గార్డెన్లలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

తెరపైకి గొలుసు గొడవ

మెదక్/పాపన్నపేట: తవ్వినకొద్దీ అక్రమాలే.. అన్నట్లుగా మారింది ఏడుపాయల ఆలయ ఈఓ వ్యవహార శైలి. వనదుర్గామాత ఆభరణాల వ్యవహారం ఇంకా సమసిపోకముందే తునికి నల్లపోచమ్మ అమ్మవారి గొలుసు విషయం తెరమీదకు వచ్చింది. మొక్కులో భాగంగా 2018లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అమ్మవారికి బంగారు గొలుసును సమర్పించారు. దీనిని అప్పటి ఈఓ శ్రీనివాస్‌కు అప్పగించారు. కాగా ప్రస్తుతం ఆ గొలుసు రికార్డుల్లో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

బయటకొచ్చింది ఇలా...

2016 నుంచి 2019 వరకు కొడిపల్లి మండలం తునికినల్ల పోచమ్మ ఆలయంలో శ్రీనివాస్ ఈఓగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అమ్మవారికి 5 తులాల బంగారు గొలుసును బహూకరించారు. 2019 జూన్‌లో ఈఓ శ్రీనివాస్ ఏడుపాయల ఆలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే దంపతులు నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వస్తున్నారని, ఆయన అందించిన బంగారు గొలుసును అమ్మవారికి అలంకరించాలని ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి ప్రస్తుత ఈఓ మోహన్‌రెడ్డికి సూచించారు. కాగా.. శ్రీనివాస్ బదిలీ అయిన సమయంలో తనకు చెక్‌బుక్, క్యాష్‌బుక్‌లు మాత్రమే ఇచ్చారని, అమ్మవారి ఆభరణాలు ఏమీ ఇవ్వలేదంటూ మోహన్ రెడ్డి చెప్పడంతో అసలు విషయం బయటకువచ్చింది. ఆలయానికి సంబంధించిన లావాదేవీల వివరాలను ఎందుకు రికార్డు చేయలేదనే ప్రశ్న తలెత్తుతుంది. ఎమ్మెల్యే బహూకరించిన గొలుసునే రికార్డులో లేదంటే మామూలు భక్తులు అందించిన కానుకల మాటేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నల్లపోచమ్మ అమ్మవారి గొలుసు విషయంపై ఈఓ సార శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బంగారు చైన్ బహూకరించిన మాట వాస్తవమేనని అంగీకరించారు. కాగా అది తన సంరక్షణలోనే ఉందని చెప్పడం కొసమెరుపు.

అవినీతి రహిత పాలన కేసీఆర్‌కే సాధ్యం

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్ కండువాలను కప్పి ఆహ్వానిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అవినీతి రహిత పాలన కేసీఆర్‌కే సాధ్యమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయం ఆవరణలో జగదేవ్‌పూర్ మండలం బీజీ వెంకటాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ పాలనలో స్కీములన్నీ స్కాములుగా మారాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా లబ్ధిదారులకే అందేలా చర్యలు చేపడుతున్నారని కొనియాడారు. దళితుల జీవితాల్లో వెలుగుల నింపడానికి ప్రభుత్వం దళిత బంధును ప్రవేశపెడితే.. గజ్వేల్ నియోజకవర్గంలో అమలుకానివ్వకుండా కాంగ్రెస్ నేతలు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ పథకం నిరంతర ప్రక్రియ అని దశలవారీగా అర్హులందరికీ అందుతుందని చెప్పారు. మరోవైపు వర్గల్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఒకవైపు చర్యలు చేపడుతుండగా.. మరోవైపు వాటిని అడ్డుకోవడానికి కాంగ్రెస్ నేతలు కేసులు వేస్తున్నారని చెప్పారు. ప్రజల మద్దతుతో కుట్రలను తిప్పికొడతామని హెచ్చరించారు. బీజీ వెంకటపూర్ సర్పంచ్ మంజుల రమేశ్, ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా బాధ్యులు కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న అలంకరణ

ఇస్రో చంద్రయాన్-3 విజయం సాధించడంపై మండలంలోని స్కూల్ తండా వాసులు, గ్రామస్తులు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. తీజ్ ఉత్సవాల్లో భాగంగా వరి నారుతో ఇస్రోకు శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన అలంకరణ ఆకట్టుకుంది. – హవేళీఘనపూర్(మెదక్)

గద్దర్, సాయిచంద్‌లు.. జనం గుండె చప్పుళ్లు

వీరి ఆశయసాధనకు నిరంతరం పాటుపడదాం

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్ రజని, గద్దర్ కూతురు వెన్నెల
- దుబ్బాకలో ఘనంగా సంస్మరణ సభ



మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్

దుబ్బాకటౌన్: ప్రజాయుద్ధనౌక గద్దర్, ప్రముఖ గాయకుడు సాయిచంద్‌లు కోట్లాది జనం గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోతారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్, సాయిచంద్ సతీమణి రజని, గద్దర్ కూతురు వెన్నెల అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణం బాలాజీ గార్డెన్‌లో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు, ప్రజలు గద్దర్, సాయిచంద్‌లకు నివాళులర్పించారు. ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న, ముక్కపల్లి శ్రీనుతో పాటు పలువురు గాయకులు పాడిన పాటలు ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా రజని, వెన్నెల మాట్లాడుతూ గద్దర్, సాయిచంద్‌లు వ్యక్తులు కాదని కోట్లాది జనం గుండెల చప్పుడు అన్నారు. తాడిత, పీడిత ప్రజలను చైతన్యం చేస్తూ సమసమాజంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని నమ్మి విప్లవ బాట పట్టిన గద్దర్ ప్రపంచంలోనే గొప్ప ఉద్యమకారుడిగా నిలిచాడన్నారు. ప్రత్యేక రాష్ట్ర కోసం జరిగిన ఉద్యమంలో సాయిచంద్ పాడిన పాటలు లక్షలాది జనాన్ని ఉద్యమంలోకి కదలించాయన్నారు. వీరి ఆశయాల సాధన కోసం నిరంతరం పాటు పడదామన్నారు. వీరు లేరని బాధపడ్డాం కాని మీ ఆప్యాయత ను చూస్తుంటే మహాసముద్రం లాంటి కుటుంబం మాకు అండగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆస యాదగిరి, ర్యాకం శ్రీరాములు, బక్కి వెంకటయ్య, నిమ్మ రజిత, ఆస శ్రీరాములు, ఆస పెద్ద ముత్యం, ఆస స్వామి, ఇల్లందుల శ్రీనివాస్, తౌడ శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమాలలో గద్దర్ పాత్రపై నేడు జాతీయ స్థాయి చర్చ

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రజాగాయకుడు, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గద్దర్‌పై జాతీయ స్థాయి చర్చ కార్యక్రమం సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. చరిత్ర, తెలుగు విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్, చరిత్ర విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాస్, తెలుగు విభాగం హెచ్ఓడీ డాక్టర్ మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కాత్యాయని విద్మహే, ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కాసిం, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, పోతన సాహిత్య పీఠం వరంగల్ అధ్యక్షుడు గడ్డం వెంకన్న తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

పటాన్‌చెరు టౌన్ : విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టడంతో మూడు ఇళ్లలో షార్ట్‌సర్క్యూట్‌తో వస్తువులు కాలిపోయిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ పరిధి గ్రీన్ విడోస్ కాలనీలో లారీని వెనుకకు తీస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభంపైన వైర్లు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ కావడంతో స్థానికంగా ఉన్న మూడు ఇళ్లలో రెండు టీవీలు, రెండు ఏసీలు, గీజర్ పాడయ్యాయి. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ మణికంఠ ఆదివారం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


లక్ష్మణ్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నర్సిపల్లి బీరప్ప, శంకరమ్మ ఏకైక కుమారుడు లక్ష్మణ్(20). ఇతను ఐఎంఎల్ డిపో నుంచి మద్యం రవాణా చేసే వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడిన లక్ష్మణ్ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని గొల్ల గుట్ట వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్ మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని, తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

కాళ్ళకల్ గ్రామ శివారులో..

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బంగారమ్మ దేవాలయం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. మృతుడి తలను ఎవరో పగులగొట్టి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ సైకిల్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపిన వివరాలు. న్యాల్‌కల్‌కు చెందిన సంకు చంద్రయ్య(27) స్క్రాప్ సామాన్ల వ్యాపారం చేస్తుంటాడు. ఎప్పటిలాగే శనివారం వ్యాపారం నిమిత్తం గ్రామాలకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా రుక్మాపూర్ గ్రామ శివారులో మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మృతదేహం లభ్యం

తాండూరు టౌన్: ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన తాండూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన బ్యాగరి చంద్రప్ప (25) హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తుండేవాడు. ఆదివారం ఉదయం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న సత్య సాయి టిఫిన్ సెంటర్ ఎదుట విగత జీవిగా పడి ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

దొంగచాటుగా టోల్ బాదుడు


గుమ్మడిదల వద్ద ఉన్న టోల్‌గేట్

- టోల్‌గేట్ సమీప వాహనదారులకు ఉచిత ప్రవేశ నిబంధన బేఖాతర్
- గుట్టుచప్పుడుగా ఫాస్టాగ్ ద్వారా డబ్బులు వసూలు
- గగ్గోలు పెడుతున్న స్థానికులు

జిన్నారం(పటాన్‌చెరు): టోల్‌గేట్‌కు సుమారు 20 కిలోమీటర్ల పరిధిలోని వాహనాలను ట్యాక్స్ వసూలు చేయకుండా ఉచిత ప్రవేశం కల్పించాలనే నిబంధన ఉంది. కానీ ఇది అమలుకు నోచుకోవడం లేదు. స్థానికులకు టోల్ వసూలు చేయటం లేదని నిర్వాహకులు చెబుతున్నప్పటికీ ఫాస్టాగ్ ద్వారా దొంగచాటుగా డబ్బులు కట్ చేస్తున్నారు. ఆధార్ కార్డ్ చూపించినా జేబులకు చిల్లు పడటంపై స్థానికులు మండిపడుతున్నారు. సమస్య పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని టోల్‌గేట్ సమీపంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్- మెదక్ జాతీయ రహదారి గుమ్మడిదల వద్ద టోల్‌ప్లాజాను ఏర్పాటు చేశారు. సమీపంలోని గ్రామాలకు సంబంధించిన ఫోర్‌వీలర్ వాహనాలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించారు. బొంతపల్లి, దోమడుగు, జిన్నారం, అన్నారం, మంబాపూర్, కానుకుంట తదితర గ్రామాల నుంచి ప్రతి నిత్యం ఫోర్‌వీలర్ వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. టోల్‌గేట్‌కు సుమారు 20కిలోమీటర్ల దూరం వరకు ఉన్న వాహనాలకు ఉచిత ప్రవేశ సౌకర్యాన్ని కల్పించాల్సి ఉంది. కాగా, కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా టోల్ యాజమాన్యం ఫాస్టాగ్ నుంచి డబ్బులు వసూలు చేస్తుంది. ఆధార్‌కార్డు చూపి టోల్‌గేట్ పక్క నుంచి వెళ్తున్నప్పటికీ గంట తర్వాత ఫాస్టాగ్ ద్వారా డబ్బులు కట్ అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇలాంటి సంఘటనలు నాలుగు నెలల నుంచి జరుగుతున్నాయి. ఉచిత సౌకర్యమని చెప్పి గుట్టుచప్పుడు కాకుండా ఫాస్టాగ్ నుంచి డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వాహనదారులు పేర్కొన్నారు. టోల్‌గేట్ యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి సమీపంలోని వాహనాలకు ట్యాక్స్ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పక్కనుంచి వెళ్తున్నా కట్ చేస్తున్నారు

టోల్‌గేట్ పక్క నుంచి వెళ్తున్నా ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్ అయ్యాయి. నాతో పాటు మిగతావారి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పక్క నుంచి వెళ్తున్న సమయంలో ఓ వ్యక్తి స్కానర్‌ను పట్టుకుని ఉండటం వల్లే ఇలా జరుగుతుంది. యాజమాన్యం బలవంతంగా డబ్బులు వసూలు చేస్తుంది. ఈ విషయమై అధికారులు విచారణ జరపాలి. లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తాం. – ఆనంద్‌వారి, వాహనదారుడు

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

స్థానికులకు కూడా టోల్ యాజమాన్యం ఫాస్టాగ్ ద్వారా గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు కట్ చేయటం సరైంది కాదు. ఈ విషయం పలుమార్లు నా దృష్టికి వచ్చింది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ద్వారా ఉన్నతాధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేస్తాం. – కుమార్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు, గుమ్మడిదల

చెరువులో దూకి ఆత్మహత్య


మోహన్(ఫైల్)

నర్సాపూర్‌రూరల్: కుటుంబ పోషణ భారం కావడంతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తుకారం తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాట్రోత్ మోహన్(31) కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పని చేసుకోలేని పరిస్థితి నెలకొంది. భార్య లత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడినప్పుడు చికిత్స కోసం చేసిన అప్పులు తీర్చలేక, కుటుంబ పోషణ కష్టం కావడంతో మోహన్ శనివారం రాత్రి నర్సాపూర్ రాయరావు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి కావడంతో ఆదివారం ఉదయం శవాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం నుంచి బొంతపల్లి కమాన్ వైపు వెళ్తున్న ఓ ఆటో అదుతప్పి బోల్తా పడటంతో పలువురికి గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. జిన్నారం నుంచి బొంతపల్లికమాన్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆటో కొచ్చెరు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వీరన్నగూడకు చెందిన ఊషమ్మ తీవ్రంగా గాయపడింది. మరో ఐదుగురికి గాయాలు కాగా సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైలంలో సిద్దిపేట కళాకారుల నాట్య ప్రదర్శన


కళాకారులతో నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాసం సందర్భంగా సిద్దిపేట పట్టణానికి చెందిన శ్రీ భవాని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు ఆదివారం శ్రీశైలంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో నృత్య ప్రదర్శన చేశారు. డాక్టర్ భవాని 28 మంది శిష్యబృందంతో ఓం నమఃశివాయ సూత్రం, అమ్మవారి శృతి, ఐగిరి నందిని, వినాయక కౌతమ్, పుష్పాంజలి, ఘననాయక దశావతారాలు, ముద్దగారే యశోద, శివకృతి, లింగాష్టకం, గంగాధర శ్రీశైలనాద, పేరిణి శివతాండవం, తదితర అంశాల్లో నృత్యప్రదర్శనలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ నృత్యకారులకు దైవదర్శనంతో పాటుగా ఆలయ సర్టిఫికెట్, తీర్థప్రసాదాలు అందించారు. ఈ ప్రదర్శనలో భవాని, విజయ్, అపర్ణ, హర్షిత, దీపిక, రమ్య, సంధ్య, లిఖిత, సాన్వితశ్రీ, మాన్విత, మధులిక, నందితసుకృత, లక్ష్మిఅనన్య, శ్రీనిధి, శ్రీవల్లి, శ్రీకరి, నిత్య, అభిజ్ఞ, హారిక, నైనిక, సుమేధ, సమన్వి, జితేష్, ధనుష్, పాల్గొన్నారు.


బంగారం తరలింపుపై విచారణ చేపట్టాలి

- మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి


శశిధర్‌రెడ్డి

హవేళీఘనపూర్(మెదక్): ఏడుపాయల దుర్గామాత అమ్మ వారి బంగారాన్ని అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఈఓ సార శ్రీనివాస్ తరలించడంపై విచారణ జరిపించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎంతో ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గామాతకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు బంగారు నగల రూపంలో మొక్కులు చెల్లించుకుంటారు. ఇలా వచ్చిన బంగారాన్ని అధికార పార్టీ నేత అండతో హైదరాబాద్‌లో కరిగించి ఈఓ ఇంట్లో పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆగడాలకు అంతులేకుండా పోతుందని విమర్శించారు. అలాంటి వారికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కేవలం వ్యక్తిగత అభివృద్ధి చూసుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

ఆంజనేయా.. ఆభరణాలు భద్రమేనా?


చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయ ఆభరణాలు భద్రమేనా అని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏడుపాయల దుర్గమ్మ ఆలయానికి సంబంధించిన బంగారం ఈఓ శ్రీనివాస్ తన ఇంట్లో పెట్టుకోవడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. గతంలో చాకరిమెట్ల ఆలయ ఈఓగా శ్రీనివాస్ పనిచేయడంతో ఆభరణాల గురించి భక్తులు చర్చించుకుంటున్నారు. పలువురు దాతలు బంగారం, వెండి వస్తువులు స్వామివారికి బహూకరించారు. వాటిని భద్రంగా బ్యాంకు లాకర్‌లో ఉంచారా లేదా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యాన్నదానం కోసం భక్తులు ఇచ్చిన విరాళాల నమోదు సైతం సక్రమంగా చేపట్టలేదని పలువురు వాపోయారు. చాకరిమెట్ల ఈఓగా శ్రీనివాస్ 2013 నుంచి 2019 వరకు విధులు నిర్వర్తించి బదిలీపై మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లారు. అనంతరం 2022లో మళ్లీ ఇక్కడికి ఇక్కడికి వచ్చారు. ఈ విషయం గురించి ఈఓ శ్రీనివాస్ వివరణ కోరగా చాకరిమెట్ల ఆంజనేయస్వామికి సంబంధించిన ఆభరణాలు దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ బ్యాంకు లాకర్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. నిత్యాన్నదానం కోసం దాతలు ఇచ్చిన డబ్బులు ఆలయ బ్యాంకు ప్రత్యేక ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

దోమ: మతిస్థిమితం సరిగా లేని ఓ యువతి క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన దోమ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన బాపురం గొరేప్ప, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె అనిత(20)కు నంజు వ్యాధితో పాటు మతిస్థిమితం లేదు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె పురుగు మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు నారాయణపేట జిల్లా కోస్గిలోని ఓ ప్రైవేటు ఆస్పతిరకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పర్మినెంట్ చేసే వరకు సమ్మె


ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని మున్సిపల్ కార్మికుల సంఘం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. ఆదివారం కార్మికులు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గత పదిహేను రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం వాపోయారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఈ నెల 5న రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు విధులు బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మధు, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవాలయాల్లో హుండీలు మాయం

- దుబ్బాక బాలాజీ, ధర్మాజీపేట ఎల్లమ్మ ఆలయాల్లో వరుస చోరీలు
- భయాందోళనలో ప్రజలు


దుబ్బాక బాలాజీ దేవాలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం


ధర్మాజీపేటలో సీసీ ఫుటేజీలో నమోదైన దుండగులు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట వార్డులోని దేవాలయాలలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ధర్మాజీపేట హనుమాన్ దేవాలయంలో చోరీ జరిగి వారం రోజులు గడవకముందే రేణుకా ఎల్లమ్మ ఆలయంలో, దుబ్బాక బాలాజీ ఆలయంలో హుండీలను దుండగులు ఎత్తుకెళ్లారు. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బాలాజీ ఆలయంలో శనివారం రాత్రి పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం పూజారి గుడి తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం వచ్చిచూడగా ఆలయ ప్రాంగణంలోని హుండీ కనబడలేదు. పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో దాదాపు రూ.3 వేల వరకు నగదు ఉంటుందని అర్చకుడు తెలిపారు. ఆలయ మేనేజర్ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ధర్మాజీపేటలో..

ధర్మాజీపేట వార్డులో ఎల్లమ్మ దేవాలయంలో శనివారం అర్ధరాత్రి దుండగులు హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలో దాదాపు రూ.వేయి వరకు నగదు ఉంటుందని ఆలయ బాధ్యులు, కౌన్సిలర్ బాలకృష్ణ గౌడ్ తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీంతో పరిశీలించి పోలీసులు ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు దొంగలు హుండీలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించామని ఎస్సై తెలిపారు.

భయాందోళనలో ప్రజలు

వారం రోజులుగా ఆలయాల్లో వరుసగా 3 దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆలయాలకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దొంగలను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరుతున్నారు.

ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రైవేట్ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని, జాబ్ ఆఫర్, కేవైసీ అప్‌డేట్ అంటూ మెసేజ్‌లు పంపి డబ్బులు కాజేస్తున్నారు.



- రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాలు
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఉద్యోగులే టార్గెట్

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరగాళ్లు పంపించిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లక్ష రూపాయలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ నందన్ హోమ్స్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 24న తన వాట్సాప్‌కు ఓ మెసేజ్ లింక్ వచ్చింది. దానికి స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన వివరాలను నమోదు చేసి బిట్ కాయిన్ ట్రేడింగ్‌లో లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి గూగుల్ పే నుంచి వేశావు.. ఫోన్ పే ద్వారా మరో లక్ష వేయాలని అడిగాడు. అనుమానం వచ్చిన బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ ఆఫర్ అంటూ..

జాబ్ ఆఫర్ అంటూ టెలిగ్రామ్‌కు వచ్చిన ఓ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.2.60 లక్షలు మోసపోయిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. బీరంగూడ బాలాజీ నగర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఏప్రిల్ 14వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దానికి స్పందించి తన వివరాలు నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా టాస్కులు చేస్తూ నగదు పెడుతూ వచ్చాడు. చివరికి తాను పెట్టిన రెండు లక్షల 60 వేలతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కేవైసీ అప్‌డేట్ అంటూ..

కేవైసీ అప్‌డేట్ అంటూ వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి ఓ వ్యక్తి లక్ష 37 వేల రూపాయలను పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని నారాయణ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి బ్యాంకు వాళ్ళమంటూ కాల్ చేశారు. కేవైసీ అప్ డేట్ చేసుకోవాలని సూచించడంతో బాధితుడు అపరిచిత వ్యక్తికి బ్యాంకు వివరాలు చెప్పాడు. దీంతో బాధితుడికి ఖాతా నుంచి లక్ష 37 వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కూలిన ట్రాన్స్‌ఫార్మర్


నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

తాండూరు: భారీ వర్షానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. మున్సిపల్ పరిధి 6వ వార్డులో చంద్ర థియేటర్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కన తాగునీటి పైప్‌లైన్ వేసేందుకు గుంతలు తీశారు. శని, ఆదివారం కురిసిన వర్షానికి దిమ్మె కుంగి, ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. దీంతో పరిసర ప్రాంత కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు మరో ట్రాన్స్ ఫార్మర్ ద్వారా సరఫరాను పునరుద్ధరించారు. మరో రెండు రోజుల్లో దిమ్మెకు మరమ్మతు చేసి, కనెక్షన్ ఇస్తామని అధికారులు పేర్కొన్నారు.



ఇక్కడెవరున్నారో చెప్పకోండి

ఆకులో ఆకునై..చెట్టులో చెట్టునై అని ఓ సినీకవి రాసిన పాటకు నిదర్శనమే ఈ చిత్రం. ఇక్కడ మిడత జాతికి చెందిన కీటకాలు, చెట్టు మొదలు ఒకే రంగును పోలి ఉన్నాయి. దీంతో క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్ప కీటకాలను కనిపించడం లేదు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ అభయజ్యోతి మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

– కె.సతీష్, సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట